www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంసకలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:15 SATURDAY ,MAY 23 ,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 15 శనివారం 23 మే 2026 పేజీలు :8 వెల: 4/-

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి



హంసకలం మే 22

తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన - మిగతా2లో

# హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సరికొత్త చరిత్ర

## రికార్డు సాధించిన వైద్య బృందానికి సీఎం సెల్యూట్

హంసకలం మే 22

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సరికొత్త చరిత్ర సృష్టించింది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పునర్జన్మ ప్రసాదిస్తూ తాజాగా 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసింది. నిమ్స్ సాధించిన ఈ అరుదైన మరియు అద్భుతమైన మైలురాయి పై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నిమ్స్ నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల వైద్యులు, సిబ్బందిని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ రంగంలో నాణ్యమైన కార్పొరేట్ వైద్య సేవలు అందించడంలో నిమ్స్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. తాజా రికార్డుతో దక్షిణ భారతదేశంలోనే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో నిమ్స్ నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇక దేశ వ్యాప్తంగా చూసుకుంటే నిమ్స్ అత్యున్నతమైన మూడో స్థానంలో నిలిచింది. - మిగతా2లో



# భారత్ ఎన్నటికీ తలవంచదు: అమిత్‌షా

హంసకలం మే 22

సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఇందు కోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నామనీ దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలసదారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం నాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, - మిగతా2లో



# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

హంసకలం మే 22

రిజర్వేషన్ల పై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడం పై అభ్యంతరం - మిగతా2లో




# ధాన్యం కొనుగోలు సమస్యల పై కవిత సచివాలయం ముట్టడి



హంసకలం మే 22

ధాన్యం కొనుగోలు సమస్యల పై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సచివాలయం ఎదుట మెరుపు ధర్నా చేపట్టారు. రైతుల పంటలను వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాసంగి ధాన్యం - మిగతా2లో

# తెలంగాణలో అంగన్‌వాడీ కొలువులు.. 15,982 పోస్టుల భర్తీకి సర్కార్ సన్నాహాలు




హంసకలం మే 22

తెలంగాణలోని నిరుద్యోగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేసేందుకు వేగంగా కసరత్తు చేస్తోంది. మొత్తం 15,982 - మిగతా2లో

# మహిళా సంఘాలకు రుణాల పై భట్టి విక్రమార్క శుభవార్త



వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామన్న భట్టివిక్రమార్క
సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యత
వ్యవసాయ రంగంలో లక్ష్యాలను మించి రుణాలు ఇస్తున్నాయని బ్యాంకులకు కితాబు

# భూదోపిడీ మీద ఉన్న శ్రద్ధ.. రైతన్నల పై ఏదీ

హంసకలం మే 22

కాంగ్రెస్ ప్రభుత్వానికి భూముల దోపడీ మీద ఉన్న శ్రద్ధ దేశానికి అన్నంపెట్టే రైతులపై లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. మొన్నటికి మొన్న రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి భూ హారతి ద్వారా కేసముద్రంలో అసైన్డ్ పట్టాలు ఆక్రమించాడని ఆరోపించారు. - మిగతా2లో



# మలేషియాలో 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

హంసకలం మే 22

మలేషియా తెలంగాణ అసోసియేషన్, బీఆర్ఎస్ మలేషియా సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6న కౌలాలంపూర్‌లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్ ను మాజీ మంత్రి ,ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ - మిగతా2లో



# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

-మొదటిపేజీ తరువాయి

అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్థక ఆస్తులు 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలి. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గానూ ప్రభుత్వం రూ.147.91 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలి. వీటితో పాటూ పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తెలిపారు.

# భారత్ ఎన్నటికీ తలవంచదు: అమిత్‌షా

-మొదటిపేజీ తరువాయి

అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ డెమోగ్రాఫిక్స్‌ను సురక్షితంగా ఉంచేందుకు అక్రమ వలసదారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఒక్కరిని వెనక్కి పంపిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం దేశంలోని 6,000 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను అమలు చేస్తుందని చెప్పారు. స్మార్ట్ బోర్డర్ కాన్సెప్ట్ కింద రాడార్లు, అడ్వాన్స్డ్ కెమెరాలతో బీఎస్ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తామని వివరించారు. బీఎస్ఎఫ్ నేరుగా రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, విలేజ్ పట్వారీల సమన్వయంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవాలని, అక్రమ చొరబాటుదారులను, పశువుల అక్రమ రవాణా మార్గాలను గురించాలని అమిత్‌షా సూచించారు. పశ్చిమబెంగాల్, అస్సాం, త్రిపుర రాష్ట్రాలను కలుపుకుని కలుపుతూ సెక్యూరిటీ గ్రిడ్ ఏర్పాటు జరుగుతుందని, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో హోం శాఖ త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. వామపక్ష తీవ్రవాదం నిర్మూలనపై మాట్లాడుతూ, సమస్యను కంట్రోల్ చేయడం కేవలం భద్రతగా చూడరాదని, ఈ బెడదను సమూలంగా పెకిలించాల్సిందేనని అన్నారు. వాపక్ష తీవ్రవాదం ఎలా నిర్మూలించామో అదే రేతిలో చొరబాటుదారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఫ్రంట్‌లైన్ జవాన్లకు సహకరించేందుకు ఉన్నతస్థాయి డెమోగ్రఫీ మిషన్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు అమిత్‌షా ప్రకటించారు. దేశభద్రతకు బీఎస్ఎఫ్ అందిస్తున్న సేలను అమిత్‌షా ప్రశంసించారు. 1965లో బీఎస్ఎఫ్‌ను కేవలం 25 బెటాలియన్లతో ప్రారంభించగా ఇప్పుడది 2,70,000 మందితో పటిష్టమైన దళంగా ఏర్పడిందని, ప్రపంచంలోనే అతిపెద్ద సరిహద్దు రక్షణ దళంగా నిలిచిందని అన్నారు. సరిహద్దుల పటిష్టత విషయంలో బీఎస్ఎఫ్ ఎప్పుడూ వెనుకంజ వేయలేదన్నారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా శత్రువును చిత్తుచేస్తూ వచ్చారని, దేశం ఎప్పుడూ తలవంచుకునే పరిస్థితి రాలేదని అన్నారు. విధి నిర్వహణలో అసమాన సేవలందించిన బీఎస్ఎఫ్ సిబ్బందిని హోం మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

-మొదటిపేజీ తరువాయి

ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడం పై ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీలేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు.అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక,ఈ కేసులో సుప్రీంకోర్టు. కేంద్ర ప్రభుత్వానికి,ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## తెలంగాణలో అంగన్‌వాడీ కొలువులు.. 15,982 పోస్టుల భర్తీకి సర్కార్ సన్నాహాలు

-మొదటిపేజీ తరువాయి

టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ఈ ఏడాదిలోనే నోటిఫికేషన్ జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాలతో అంగన్‌వాడీ కేంద్రాల సేవలను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**భారీగా ఖాళీల గుర్తింపు**

ప్రస్తుతం రాష్ట్రంలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 22.33 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2025-26 నాటికి పదవీ విరమణలు, సిబ్బందికి సూపర్‌వైజర్లుగా పదోన్నతులు రావడం, కొందరు ఇతర ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ఉద్యోగాలు సాధించడం వంటి కారణాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. మొత్తం 15,982 పోస్టులలో 12,882 హెల్పర్ పోస్టులు, 3,100 టీచర్ పోస్టులు ఉన్నాయి. వీటికి అదనంగా కొత్తగా ఏర్పడిన 708 ఉద్యోగాలను కూడా కలిపి ఈ నియామక ప్రక్రియ చేపట్టనున్నారు.

**నియామక ప్రక్రియ ఇలా..**

ఈ నియామక ప్రక్రియను జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనికి ముందుగా రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ విద్యా అర్హతలు, ఎంపిక విధానంపై స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించనుంది. కొత్త నియామక విధానానికి ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే జిల్లాల వారీగా నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. స్థానిక మహిళలకు ఈ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది.

**మౌలిక సదుపాయాల కల్పన**

కేవలం ఉద్యోగాల భర్తీకే పరిమితం కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం పైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా, 9,000 కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు, 7,700 కేంద్రాలకు మరుగుదొడ్లు, 5,000 కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే, వెయ్యి కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించి, 3,300 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు.

## భూదోపిడీ మీద ఉన్న శ్రద్ధ.. రైతన్నల పై ఏదీ

-మొదటిపేజీ తరువాయి

ఎకరాల సీలింగ్ భూమిని తహసీల్దార్, కలెక్టర్ స్థాయిలో ఉత్తర్వులు ఇచ్చి వేల కోట్ల భూమిని దోపిడీ ఎలా చేశారో ఏసీబీ దాడిలో దొరికారు. అయినా కూడా ఇలాంటి వాటిపై రేవంత్ రెడ్డి దృష్టి పెట్టడని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టక రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ధాన్యం కొనుగోళ్లపై చేపట్టిన సమీక్ష తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. డబ్బు సంచుల మీద ఉన్న శ్రద్ధ ధాన్యం సంచుల సేకరణలో లేదని మండిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా వడ్లు కొనక 45 రోజుల్లో 10 మంది చనిపోతే ఒక్కరు కూడా చనిపోలేదని సివిల్ సప్లైస్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సిగ్గు లేకుండా అబద్దాలు ఆడుతున్నారు. మంత్రి సొంత జిల్లాలో మహ్మద్ నసీరుద్దీన్ అనే రైతుల ధాన్యం రాశిపైనే మృతి చెందాడన్నారు. జనగామ జిల్లా ఏనెబావిలో కాంటాలు పెట్టడంలేదని కాంగ్రెస్ కార్యకర్తలే ఆందోళన చేరన్నారు. ఇనేక సంఘటనలు జరిగాయన్నారు. ఓ కాంగ్రెస్ నాయకుడు మా పార్టీ నాయకుడికి ఫోన్ చేసి, ధాన్యం ప్రభుత్వం కొనుడు ఎందయ్యా, మాకు లేని పని పెట్టిండు మా కేసీఆర్ అని చెప్తున్నాడు ఓ కాంగ్రెస్ నాయకుడు మా పార్టీ నాయకుడికి ఫోన్ చేసి ధాన్యం ప్రభుత్వం కొనుడు ఎందయ్యా, మాకు లేని పని పెట్టిండు మా కేసీఆర్ అని చెప్తున్నాడు. రాష్ట్రంలో ఇప్పటివరకు 35? ధాన్యం కూడా కొనుగోలు చేయలేదన్నారు. కానీ రేవంత్ రెడ్డి, అతని మంత్రులు 80? కొనుగోలు చేశామని అబద్దాలు చెప్తున్నారని మండిపడ్డారు. రైతుల ఇబ్బందుల మీద అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఊరికైనా పోదాం.. ఎక్కడన్నా మీరు చెప్పినట్లు 80 శాతం పంట కొనుగోళ్లు చేశారని నిరూపిస్తే మేము ఏ శిక్షకైనా సిద్ధమని రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఛాలెంజ్ విసిరారు. రేవంత్‌లో అగౌరవంగా మాట్లాడే భాష తనకు రాదన్నారు.

## హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సరికొత్త చరిత్ర

-మొదటిపేజీ తరువాయి

దేశంలో టాప్-3 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆసుపత్రులు, ఐకేడీఆర్‌సీ - గుజరాత్ (తొలి స్థానం), క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ - లూథియానా (రెండో స్థానం), నిమ్స్- హైదరాబాద్ (మూడో స్థానం), కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలతో కూడుకున్న కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ పేదలకు ఉచితంగా అందించి అండగా నిలిచింది. నిమ్స్‌లో జరిగిన మొత్తం 2,000 కిడ్నీ మార్పిడి చికిత్సల్లో ఏకంగా 95 శాతం శస్త్రచికిత్సలు ఆరోగ్యశ్రీ మరియు సీఎం సహాయనిధి ద్వారా ఉచితంగా జరిగాయి. అంటే దాదాపు 1,900 మంది పేద రోగులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నిమ్స్ వైద్యులు ఉచితంగా కిడ్నీ మార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు.గతంలో కంటే నిమ్స్ ఆసుపత్రిలో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు మెరుగుపడటంతో కిడ్నీ మార్పిడిల వేగం పుంజుకుంది.2023 జనవరి నుంచి ఇప్పటివరకు (గడిచిన 3 ఏళ్ల 4 నెలల కాలంలోనే) రికార్డు స్థాయిలో 500 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ పూర్తి చేయడం విశేషం. నిరంతరాయంగా, అంకితభావంతో కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందిస్తున్న నిమ్స్ వైద్య బృందాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, వైద్య ప్రముఖులు కొనియాడుతున్నారు.

## ధాన్యం కొనుగోలు సమస్యల పై కవిత సచివాలయం ముట్టడి

-మొదటిపేజీ తరువాయి

కొనుగోలు సమస్యల పై ఒకవైపు తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రెస్‌మీట్ కొనసాగుతుండగానే అదే సమస్య పై మరోవైపు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవిత సచివాలయం ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేస్తూ పార్టీ శ్రేణులలో కలిసి సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వెంటనే రంగప్రవేశం చేసిన పోలీసులు ధర్నా చేస్తున్న టీఆర్ఎస్ కార్యకర్తలను వ్యాన్‌లో, కవితను కారులో పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పంట కొనుగోలు లేక రైతులు నానా అవస్థలు పడుతుంటే ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోయి లేదు అని విమర్శించారు.

**రెండున్న రేళ్లలో వ్యవసాయం పై రేవంత్ రెడ్డిసమీక్ష సైతం చేయలేదు**

రెండున్నరేళ్లలో వ్యవసాయంపై సమీక్ష సైతం చేయలేదని, ధాన్యం, మక్కలు సహా ఏ పంట వేసిన రైతులైన అమ్మకాల్లో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విత్తనాలు, ఎరువులు అందడం లేదని, పంట కొనడం లేదని, రైతు భరోసా ఇవ్వడం లేదని విమర్శించారు. తక్షణమే కల్లాల్లో ఉన్న వడ్లను, అన్ని రకాల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## మహిళా సంఘాలకు రుణాల పై భట్టివిక్రమార్క శుభవార్త

-మొదటిపేజీ తరువాయి

మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లుభట్టి విక్రమార్క మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అన్నారు. ఈ క్రమంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళలు, దళిత, గిరిజన, యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీ పై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు.

## మలేషియాలో 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

-మొదటిపేజీ తరువాయి

ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్ పేరును గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ లేని లోటు రెండున్నర ఏండ్లుగా కనిపిస్తుందని వెల్లడించారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతుందని, కేసీఆర్ ఇచ్చిన పథకాలనూ ఇవ్వలేక పోతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. అమెరికా దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో గతంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డల్లాస్‌లో జరిగాయని వివరించారు. దేశంలో బీజేపీ పాలనలో చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్న నిందితులను పట్టుకునే శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభమవు తుందని, రైతులకు విత్తనాలు ,ఎరువులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి పాత గురువు, చీకటి గురువు చెప్పినట్లు రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని మండిపడ్డారు .రైతాంగాన్ని ముంచి వ్యవసాయ సబ్సిడీలు దోచుకోవాలనే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఏం జరిగిన ట్వీట్ చేసే రాహుల్ గాంధీ తెలంగాణలో మైనర్ బాలిక ఘటన పై ఎందుకు ట్వీట్ చేయ లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రజలకు , మహిళలకు శ్రీరామ రక్ష అని అన్నారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ మహేష్ బిగాల, మైటా ప్రెసిడెంట్ తిరుపతి,ఉమెన్స్ వింగ్ సుప్రియ, బీఆర్ఎస్ మలేసియా ప్రెసిడెంట్ చిట్టీ బాబు, శివ, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, పడాల సతీష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

# సంపాదకీయం


## అలుపెరుగని అభ్యుదయ సాహిత్య ప్రయాణం




"నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" శ్రీశ్రీ: జయభేరి, 933, జూన్ 2మార్క్సిజం తాత్విక సిద్ధాంతంగా, అంతర్జాతీయ వాదం స్వభావంగా, శ్రామిక వర్గం పక్షపాతంగా, బోల్షెవిక్ విప్లవం తక్షణ స్ఫూర్తిగా, సమ సమాజం స్వప్నంగా ప్రపంచ మంతా పుట్టిన సాహిత్యం అభ్యుదయ సాహిత్యం. ప్రపంచ అభ్యు దయ సాహిత్యంలో అంతర్భాగం భారతీయ అభ్యుదయ సాహిత్యం; అందులో అంతర్భాగం తెలుగు అభ్యుదయ సాహిత్యం. అభ్యుదయ సాహిత్యానికి ప్రచారవేదిక అభ్యుదయ రచయితల సంఘం (అరసం). భారతదేశంలో 1936లోను, తెలుగునాట 1943లోను అరసం సంస్థలు పుట్టాయి. తెలుగు అభ్యుదయ సాహిత్యం 1933 జూన్ రెండున అచ్చయిన శ్రీశ్రీ 'జయభేరి' కవితతో మొదలైంది. తొంభై మూడేళ్ళ చరిత్ర నింపుకున్నది. అభ్యుదయ రచయితల సంఘం ఎనభై మూడేళ్ల చరిత్ర నింపుకున్నది. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఇరవయ్యవ రాష్ట్ర మహాసభలు తిరుపతిలో ఈ నెల 23, 24 తేదీలలో జరుపుకుంటున్న నేపథ్యంలో ఒకసారి సింహావలోకనం చేసుకుంటే వందలకొద్దీ అభ్యుదయ రచయితలు అభ్యుదయ సాహిత్య చరిత్ర నిర్మాణం చేశారు. వందలకొలది సాహిత్య కార్యకర్తలు అరసం నిర్మాణంలో పాల్గొన్నారు. వీరి లక్ష్యం ప్రజావ్యతిరేక సాహిత్య నిర్మూలనం, ప్రజానుకూల సాహిత్య నిర్మాణం. అరసానిది గానీ, అభ్యుదయ సాహిత్యానిది గానీ నల్లేరు మీద బండి నడకగా సాగిపోలేదు. శరవేగంగా పరిగెత్తిన రోజులున్నాయి. మందకొడిగా నడిచిన రోజులూ ఉన్నాయి. రాజకీయ పరిణామాల ప్రభావంతో అరసం కూడా ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. 1955--65 దశాబ్దాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో స్తబ్దతా దశాబ్దం అన్నారు గానీ, అది నిజం కాదని రుజువు చేయడంలో అభ్యుదయ సాహిత్యం కూడా ఆధారమైంది. అయినా 1965 తర్వాత దిగంబర కవిత్వం, విప్లవ సాహిత్య కాలంలో అరసం, అభ్యుదయ సాహిత్యం తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొన్నాయి. హేళనకు గురయ్యాయి. అయితే ఏ ఉద్యమానికైనా గుంటమిట్టలు ఉంటాయని ఆ తర్వాత తెలుగు సమాజం, సాహిత్య పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఇదిలా ఉంచుదాం. భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలను ధిక్కరించి, సామ్యవాద వ్యవస్థకు అనుకూలంగా భావ ప్రచారం చేసేది అభ్యుదయ సాహిత్యం. ఇది ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచేది. శ్రమదోపిడీ, మతమౌఢ్యం, ఆధిపత్య ఉన్మాదం, సాంఘిక వివక్ష వంటి తిరోగమన అంశాలను శత్రువులుగా పరిగణిస్తుంది అభ్యుదయ సాహిత్యం. ఇది సమాజాన్ని భౌతిక దృష్టితో, వర్గం దృక్పథంతో విశ్లేషిస్తుంది. అదే సమయంలో సంక్లిష్టమైన భారతదేశ సామాజిక నిర్మాణాన్ని దృష్టిలో పెట్టుకొని అస్తిత్వ వాదాలను అరసం ఆలింగనం చేసుకుంటుంది. అసమ సమాజంలో అరసం పీడితుల పక్షం వహిస్తుంది. మానవ సంబంధాలలో ఆర్థికాంశం పాత్రను రుజువు చేయడంతో, శ్రమదోపిడీని ప్రతిఘటించడంతో మొదలై, క్రమంగా అనేక సాంఘిక వివక్షలను, ఆధిపత్యాలను ప్రతిఘటించే దశకు చేరుకుంది అభ్యుదయ సాహిత్యం. అరసం ఈ పరిణామాన్ని ప్రచారం చేసింది. 1969లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని సమర్థించని అరసం, 1991 తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆఖరి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇవ్వడం ఒక పరిణామం. ప్రపంచీకరణ దుష్పరిణామాలను ఎండగట్టడంలో అరసం గానీ, అభ్యుదయ సాహిత్యం గానీ వెనకపడలేదు. ఎస్వీ సత్యనారాయణ సంపాదకత్వంలో ప్రపంచీకరణ కథలు పుస్తకం వచ్చింది. ఇటీవల ఢిల్లీలో భారతీయ రైతుల తిరుగుబాటును సమర్థించడంలో అరసం క్రియాశీలక పాత్ర నిర్వహించింది. కవి సమ్మేళనం నిర్వహించి 'హలంతో కలం' కవిత్వ సంకలనం తెచ్చింది. అలాగే మణిపూర్‌లో మహిళలను దిగంబరంగా ఊరేగించి... ఆధిపత్యవాదులు చేసిన అమానుషత్వం మీద అరసం కవి సమ్మేళనం నిర్వహించి 'మణిపూర్ మంటలు' అనే కవితా సంకలనం తెచ్చింది. తెలుగు ప్రజలు బలిదానంతో, 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని పాలకులు ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయడానికి ప్రయత్నించినప్పుడు అరసం తీవ్రంగా వ్యతిరేకించింది. 'ఉక్కుకవనం' అనే కవితా సంకలనం తెచ్చింది. అరసం వంటి సంస్థ అసంఖ్యాకంగా పుస్తకాలను ప్రచురించడం విశేషం. ఈ తరం కోసం కథ, ఈ తరం కోసం కవిత అనే పేర్లతో గురజాడ నుంచి అనేక మంది ప్రజారచయితల కవితలను, కథలను దాదాపు 100 సంపుటాలు ప్రచురించింది. ఈ తరం కోసం వచన కవిత, ఈ తరం కోసం గేయ కవిత అనే మరో రెండు సంపుటాలు కూడా అరసం ప్రచురించింది. అవి విశేషంగా పాఠకాదరణ పొందాయి. ఇటీవలి గ్రంథాలయ పునరుజ్జీవనోద్యమంలోను, తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమంలోను అరసం ఇతర ప్రజాతంత్ర సాహిత్య సంస్థలతో కలిసి కృషి చేసింది. ఇంకా ముందుకు పోతే తెలంగాణ రైతాంగ పోరాటంలోను, జమీందారీ వ్యతిరేక ఉద్యమంలోనూ అభ్యుదయ రచయితలు శ్రామికులు, పీడితులు రైతుల పక్షాన నిలిచారు. అభ్యుదయ రచయితలు అనగానే శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, సోమసుందర్, రెంటాల, సినారె, గంగినేని, కుందుర్తి, నయాగరా కవులు, సురవరం ప్రతాపరెడ్డి, విద్వాన్ విశ్వం, సి.వి, కొడవటిగంటి కుటుంబరావు, మా గోఖలే, లక్ష్మీకాంతం మోహన్, దాశరథి రంగాచార్య, శారద, గజ్జెల మల్లారెడ్డి, ఉప్పల లక్ష్మణరావు, సుంకర వాసిరెడ్డి, సి.వి కృష్ణారావు, కేతు విశ్వనాథరెడ్డి వంటి మహా రచయితలు పాఠకుల ముందు నిలుస్తారు. సృజన సాహిత్యంతో పాటు, సాహిత్య విమర్శలోనూ అభ్యుదయవాదులు అసమాన పాత్ర నిర్వహించారు. ఎం.ఆర్ చంద్ర, కొ.కు, శ్రీశ్రీ, రా.రా, వల్లంపాటి, సింగమనేని, ఆర్వీయార్, కె.వి.ఆర్, కొలకలూరి, వై.విజయకుమార్, నిడమర్తి, సొదుం రామ్మోహన్ వంటి అనేక మంది గుర్తుకొస్తారు. అరసానిది ఆర్థిక సమానవాదమైనా, సామాజిక న్యాయవాదాన్ని విస్మరించదు. పైగా సామాజిక న్యాయవాదులతో చేతిలో చేయివేసి నడుస్తున్నది. అందుకే ఈ 20వ మహాసభలను "పురోగామి చింతనాశీలుర ఐక్యతాదిశగా" అనే ప్రధాన అంశం కేంద్రంగా నిర్వహిస్తున్నది.

# మన స్వదేశీయంలో విదేశీయానిదే విజయమా







సప్తపదులు, సప్తనదులు, సప్తస్వరాలు, సప్తరుషులు.. ఇట్లా ఏడు అంకె చుట్టూ అనేక జీవిత, ఖగోళ, భౌగోళిక అంశాలను ముడిపెట్టటం మనకు కొత్తకాదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధంతో ఏర్పడిన సంక్షోభాన్ని ఎదుర్కోటానికి ప్రజలు త్యాగాలూ, పొదుపులూ చేయాలంటూ ప్రధాని మోదీ కూడా సప్తసూత్రాలను ప్రకటించారు. దేన్నైనా సప్తసూత్రాలుగా చెబితే ప్రజలను బాగా ఆకర్షిస్తుందనే మోదీ భావించి ఉండొచ్చు. సప్తానికి మన సంస్కృతి చాలా ప్రాధాన్యతను ఇచ్చింది. అందులో సందేహం ఏమీలేదు. ఇక సంస్కృతిలో బాగా పాతుకుపోయిన భావాలను ఉపయోగించుకుని రాజకీయంగా ప్రజలను సమాయత్తం చేయటం అన్ని దేశాల్లోనూ ఉంది. ఇటీవల కాలంలో ఈ విషయంలో మోదీ ప్రదర్శించే ప్రతిభ అసాధారణమైంది! ఇందులో ఆయన దరిదాపులకు వచ్చే నేతలను ప్రపంచం మొత్తంలోనే వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఆచారాలు, నమ్మకాలు, ఇష్టాయిష్టాల్లో ఎంతో వైవిధ్యం ఉన్న దేశంలో మంచికైనా చెడుకైనా సంస్కృతిని ఆధారం చేసుకుని జనాన్ని రాజకీయ లక్ష్యాలవైపు ఆకర్షించటం అంత సులువుకాదు. రాజకీయ లక్ష్యాలు సంకుచితమైనవైతే సంస్కృతి కూడా చివరికి అదే దారిలోకి వెళుతుంది. దీనికి ఏ దేశమూ మినహాయింపుకాదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు 40 రోజులపాటు భీకరంగా దాడులు చేశాయి. వీటిని అసాధారణలో రీతిలో తట్టుకుంటూ ఇరాన్ ప్రతిదాడులనూ చేసింది. గల్ఫ్‌దేశాల్లోని అమెరికా సైనికస్థావరాలు ఆ ప్రతిదాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. అమెరికాకు ఇంతకు మించిన తలవంపు ఇటీవల కాలంలో మరొకటి లేదు. కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత కూడా హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధం చేయటంతో చమురు, సహజవాయువు, ఎరువుల రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రపంచ సరఫరా వ్యవస్థే గాడితప్పింది. అయినా అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకూ యుద్ధప్రభావం గురించి విపులంగా ప్రధాని మోదీ ఎప్పుడూ మాట్లాడలేదు. అంతకు ముందుకూడా అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని బహిరంగంగా ప్రకటించనూ లేదు. యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయిపోతోందనీ దాన్ని దృష్టిలో పెట్టుకునైనా యుద్ధం ఆపాలనీ కోరలేదు. కొండెక్కిన చమురు ధరలతోనూ ఇతరత్రానూ దిగుబడుల భారం పెరిగి విదేశీ మారకద్రవ్య నిల్వలు భారీగా హరించుకుపోయే ప్రమాదం ముంచుకొస్తూ ఉండటంతో త్యాగాలు చేయాలనీ, పొదుపులు పాటించాలనీ ప్రజలకు పిలుపునిచ్చారు. సప్తసూత్రాల్లో స్వదేశీ వస్తువులను కొనాలనే పిలుపు కూడా ప్రధానంగా ఉంది. గ్లోబలైజేషన్ తర్వాత ఈ స్వదేశీ నినాదం ఎంతమేరకు ఆచరణాత్మకమో పరిశీలిస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఏదీ విదేశీ, ఏదీ స్వదేశీ అన్న గీతలు గీయటం కూడా కష్టమైపోతోంది. మేడిన్ ఇండియా వస్తువుల లోగుట్టుని లోతుగా చూస్తే అందులోని విదేశీయత రట్టు అవుతుంది. నూటికినూరుపాళ్లూ స్వదేశీ కంపెనీ ఉత్పత్తులనే కొనాలనుకుంటే మన ఎంపిక చాలా పరిమితం అయిపోతుంది. విదేశీ మారకద్రవ్యం పొదుపు లక్ష్యంగా ఇక్కడ తయారయ్యే వస్తువులను కొనుగోలు చేయించటమే మోదీ పిలుపు పరమార్థమైతే మనం పెద్దగా ఆలోచించాల్సిన అవసరం ఉండదు. 90శాతం మంది ప్రజలకు ఇక్కడే దొరికే వస్తువులే బోలెడు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో అచ్చంగా ఏవి స్వదేశీ అన్నవే సమస్య! మనం రోజూ వాడే వస్తువులనూ, ఉపకరణాలనూ స్వదేశీ కంపెనీలే తయారుచేయటం లేదు. అవి ఇక్కడ ఉత్పత్తి అవుతున్నా వాటిని స్వదేశీయతకూ, స్వావలంబనకూ ఉదాహరణలుగా చెప్పుకోలేం. అవన్నీ ప్రధానంగా విదేశీ కంపెనీల చేతుల్లో ఉన్నాయి. సర్ఫ్ ఎక్సెల్, లక్స్, లైఫ్‌బాయ్, క్లినిక్ ప్లస్, డవ్, క్లోజప్, బ్రూక్‌బాండ్ రెడ్‌లేబుల్, బ్రూ, హార్లిక్స్, బూస్ట్, లేస్, ట్రోపికానా, జిలెట్, హెడ్ అండ్ షోల్డర్స్, కాల్గేట్, పెప్సొడెంట్, మ్యాగీ, నెస్‌కేఫ్, కిట్‌క్యాట్, సెరెలాక్, కెల్లాగ్ కోర్న్‌ఫ్లేక్స్, కోకకోలా, థమ్స్‌అప్, పెప్సీ, కుర్కురే, వ్యాసలీన్, లాక్మే, పాండ్స్, రిన్, పియర్స్ లాంటి ఉత్పత్తులన్నీ విదేశీ బహుళజాతి సంస్థలకు అనుబంధంగా ఉన్న కంపెనీల నుంచే వస్తున్నాయి. మనం వినియోగించే వస్తువులన్నీ లెక్కలోకి తీసుకుంటే ఈ జాబితా ఇంకా పెరుగుతుంది. ఈ కంపెనీల్లో భారతీయుల పెట్టుబడులు లేవా? అంటే ఉన్నాయి. అవన్నీ చాలా వరకూ 45శాతం లోపే ఉంటాయి. కానీ విదేశాల్లోని మూల కంపెనీలకు సంబంధించిన పెట్టుబడులే అధికంగా ఉంటాయి. కీలక నిర్ణయాలన్నిటినీ అవే శాసిస్తాయి. ఐటీసీ, అమూల్, డాబర్, మ్యారికో, బ్రిటానికా, గోద్రేజ్, పార్లే లాంటి భారత కంపెనీల ఉత్పత్తులు కూడా మార్కెట్‌లో రాణిస్తున్నాయి. కానీ వీటి ఉత్పత్తుల వాటా మార్కెట్‌లో 42--48శాతం మధ్యలోనే ఉంటుంది. వీటితో పోల్చితే బహుళజాతి సంస్థల అనుబంధ కంపెనీల ఉత్పత్తుల వాటా ఎక్కువ. అది 52--58శాతం ఉంటుంది. నెలనెలా వాడుకునే ఈ ఉత్పత్తుల్లో భారత యాజమాన్యంలోని కంపెనీల వాటా 45శాతం ఉండటం ఊరటగా అనిపించొచ్చు. కంప్యూటర్లు, వాహనాలు, రిఫ్రిజిరేటర్లు, మొబైల్స్ దగ్గరకు వెళితే స్వదేశీ కంపెనీలు ఎక్కడో ఉంటున్నాయి. ముందుగా మొబైల్ ఫోన్ల సంగతి చూద్దాం. భారతీయుల యాజమాన్యంలో ఉన్న మొబైల్ కంపెనీలు లావా, మైక్రోమాక్స్, కార్బన్ తయారుచేసే మొబైళ్ల మార్కెట్ వాటా 2--3శాతం మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మిగతావన్నీ విదేశీ కంపెనీల మొబైళ్లే. యాపిల్ ఫోన్లను ఇక్కడ తయారుచేసే కంపెనీల్లో కూడా ఫాక్స్‌కాన్‌దే (తైవాన్) ఆధిపత్యం. మన టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ కూడా 35 శాతం వరకూ యాపిల్ ఫోన్లను తయారుచేస్తోంది. విస్ట్రన్, పెగట్రాన్ లాంటి తైవాన్ కంపెనీలో షేర్లు కొనుగోలుచేసి యాజమాన్యాన్ని పొందటంతో టాటా ఎలక్ట్రానిక్స్ ఆ పనిని సులభంగా చేయగలుగుతోంది. ఇక రిఫ్రిజిరేటర్ల పరిస్థితి చూసినా మనకు ఈ దృశ్యమే కనపడుతుంది. పది ప్రధాన బ్రాండ్లను తీసుకుంటే అందులో గోద్రేజ్, వీడియోకోన్‌లు మాత్రమే స్వదేశీ యాజమాన్యం కింద ఉన్నాయి. మిగతావన్నీ విదేశీ యాజమాన్యాలకు చెందినవే. వాటి మార్కెట్ వాటా 80--90శాతం మధ్యలో ఉంటుంది. కార్ల వ్యవహారాన్ని చూసినా పరిస్థితిలో మార్పు కొద్దిగానే కనపడుతోంది. భారతీయ కంపెనీల కార్ల మార్కెట్ వాటా ఇప్పటికీ 15--25 శాతం మధ్యలోనే ఉంది. 12 ప్రధాన కార్ల కంపెనీల్లో టాటామోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా మాత్రమే భారత యాజమాన్యానికి చెందినవి. విదేశీ కార్ల కంపెనీల మార్కెట్ వాటా 75--85శాతం మధ్యలో ఉంటుంది. కంప్యూటర్ల తయారీలో స్వదేశీ కంపెనీల వాటా 3--10శాతం మధ్యలో ఉంటే విదేశీ కంపెనీలు 90--97శాతం వాటాతో మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ఒకప్పుడు హెచ్‌సీఎల్, జెనిత్, విప్రో కంప్యూటర్లు భారతీయ బ్రాండ్లుగా మార్కెట్‌లో బాగానే ఉండేవి. కాలక్రమంలో విదేశీ కంపెనీల ధాటికి తట్టుకోలేకపోయాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా హెచ్‌పీ, డెల్, లెనోవో, యాపిల్, ఏసర్, ఏసస్ కంప్యూటర్లే మనకు కనపడతాయి. ఒకకోణం నుంచి చూస్తే ఔషధాల తయారీలో భారతీయ కంపెనీల ఆధిపత్యం కనపడుతుంది. 65--75శాతం మార్కెట్ వాటాతో అగ్రభాగాన ఉన్నాయి. బహుళజాతి కంపెనీలు మిగతా వాటాను పంచుకుంటున్నాయి. జనరిక్ డ్రగ్స్‌ను, వాక్సిన్లను పెద్దఎత్తున తయారుచేయగలగటంలో భారతీయ కంపెనీలు అసాధారణ సామర్థ్యాన్ని సంపాదించాయి. ఇది దేశ అవసరాలను పెద్దఎత్తున తీర్చటంతో పాటు విదేశాలకూ చౌకగా వాటిని ఎగుమతి చేయటానికి బాగా తోడ్పడింది. అయితే మౌలిక పరిశోధనలతో, కొత్త ఫార్ములాల ఆవిష్కరణలతో, సంపూర్ణ పేటెంట్ హక్కులతో తయారుచేసే మందుల్లో భారతీయ కంపెనీలు బాగా వెనుకబడే ఉన్నాయి. కొలెస్ట్రాల్, డయాబిటీస్, రక్తపోటుకు డాక్టర్లు రాసే మందులనూ, వివిధ ఇన్ఫెక్షన్లను తగ్గించటానికి వాడే యాంటీబయాటిక్స్‌నూ పరిశీలిస్తే మనకు పరిస్థితి అర్థమవుతుంది. వీటిల్లో దాదాపుగా అన్నీ వేరే దేశాల్లో అభివృద్ధి అయినవే ఉన్నాయి. అత్యవసరంగా మనం వాడే 100 మందులను తీసుకుంటే అందులో 1--5 వరకూ మాత్రమే మనం సొంత పరిశోధనతో ఇక్కడ అభివృద్ధి చేసుకున్నాం. ఈ పరిణామాల కోణంలో మన ఆర్థిక వ్యవస్థను స్వదేశీ, విదేశీ అని గిరిగీసి చూసుకుంటే పరిస్థితి అంతా ఆశాజనకంగానే కనిపించదు. చాలా కీలకరంగాల్లో మన అడుగులు.. చేరాల్సిన గమ్యంతో పోల్చితే తక్కువే పడ్డాయి. సంక్షోభాలు మీద పడ్డప్పుడు మాత్రమే మన పాలకులకు అవి గుర్తుకొస్తాయి. 1990లో విదేశీ మారకద్రవ్యం చెల్లింపుల్లో సంక్షోభం ఏర్పడినప్పుడు దాన్నుంచి గట్టెక్కటానికి ఆర్థికసంస్కరణలు తీసుకొచ్చారు. అలాగే కోవిడ్ విజృంభించినప్పుడు మాస్కులూ, ఇతర వైద్య ఉపకరణాలూ దొరకని పరిస్థితుల్లో మేకిన్ ఇండియా విధానానికి పదునుపెట్టారు. ఇప్పుడు పశ్చిమాసియా యుద్ధమూ అండగా ఉంటుందనుకున్న అమెరికా తెచ్చిపెట్టిన అనేక చిక్కులతో స్వదేశీ వస్తు వినియోగానికి పిలుపునివ్వటం అవసరమైంది. విదేశీ కంపెనీలు తమ సొంత పరిశోధనలతో, తమ సొంత డిజైన్లతో, తమ సొంత సాంకేతిక పరిజ్ఞానంతో భారత్‌లో ఉత్పత్తులు తయారుచేయటం వల్ల మనకు స్వావలంబన రాదు. ఎంతగా గ్లోబలైజేషన్ విస్తృతమైనా కీలక రంగాల్లో స్వావలంబన లేకపోతే ఆర్థిక వ్యవస్థ పటిష్ఠపునాదులపై ఉన్నట్లుగా భావించలేం. మేకిన్ ఇండియా ఉత్పత్తులన్నీ నిజమైన భారతీయ బ్రాండ్లుగా ప్రపంచం గుర్తించాలంటే మన సొంత సాంకేతిక పరిజ్ఞానంతో, మన డిజైన్లతో, మన పరిశోధనల పునాదులపై అవి తయారుకావాలి. అందుకు ఎంతో హేతుబద్ధమైన దృష్టీ, వైజ్ఞానిక దృక్పథమూ ఉండాలి. మతం, కులాల పేరుతో ప్రజలను ఊర్రూతలూగించటం తేలిక. సొంత సంస్కృతిలోనే గొప్పవైనవన్నీ ఉన్నాయనే భ్రమలో బతకటమూ తేలికే. మనవైన మౌలిక ఆవిష్కరణలూ, వినూత్న వస్తునిర్మాణ కౌశల్యాలే కష్టమైనవి. ఒకనాటి భారతీయ చేనేత పరిశ్రమ దాన్ని సాధించింది. అందుకే నాటి దేశాలన్నీ భారత చేనేత ఉత్పత్తుల కోసం చేతులుచాపాయి. రాజకీయంగా స్వదేశీయత గురించి మాట్లాడడం సులభం. వైజ్ఞానికంగా, సాంకేతికంగా దాన్ని సాధించటం మాత్రం ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. దాన్ని సాధించనంత కాలం మన స్వదేశీయంలో విదేశీయానిదే విజయమవుతుంది! అన్నిరంగాల్లో లోతైన విషయ విజ్ఞానాన్నీ, సాంకేతిక చాతుర్యాన్నీ సమకూర్చుకోబట్టే చైనా తన గొంతును బలంగా విన్పించగలుగుతోంది. ఇటీవల చైనాలో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ దాన్ని మనసుపెట్టి వినకా తప్పలేదు. క్షీణిస్తున్న శక్తిగా అమెరికా మారుతోందని చైనా అధినేత అంటే గట్టిగా ఖండించలేకపోయారు. అది చాలదన్నట్లుగా తైవాన్ స్వతంత్రతపై అమెరికా హామీ ఇవ్వలేదంటూ చేతులెత్తేశారు. అమెరికాతో మనకంటే ఎక్కువగా ఆర్థిక బంధాలను పెనవేసుకుని చైనా ఈ స్థాయికి వచ్చింది. స్వల్పకాలంలో అనూహ్య సామర్థ్యాన్నీ చాకచక్యాన్నీ సంపాదించుకుని ఆ దేశానికి అన్నిరంగాల్లో సవాళ్లను విసురుతోంది. ఆ స్థితికి చేరుకోటానికి అడుగులు వేయటమే మనముందన్న అసలు సవాల్! ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ దాన్ని సాధించటంలోనే అసలైన ఆత్మనిర్భరత లభిస్తుంది.

# నెన్నెల్‌లో పచ్చదన హత్య

-రాత్రికి రాత్రే మామిడి తోటల మాయం.!..
-ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు..
-అనుమతులు లేకుండానే వందల చెట్ల నరికివేత..
-ప్రకృతి నాశనంపై గ్రామస్తుల భగ్గుమంటున్న ఆగ్రహం..

హంసకలం మే 22 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలంలోని చిత్తాపూర్, ఆవడం, భగీరథపేట్ శివారు ప్రాంతాల్లో భారీ ఎత్తున జరుగుతున్న మామిడి చెట్ల నరికివేత స్థానికంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. తెలంగాణలోనే విస్తారంగా మామిడి తోటలు ఉన్న ఈ ప్రాంతంలో వందలాది ఎకరాల పాత తోటలను యంత్రాలతో నేలమట్టం చేస్తుండటంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. 40 నుంచి 50 ఏళ్ల చరిత్ర కలిగిన వందలాది మామిడి చెట్లను ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే నరికేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, నెన్నెల్ మండలం ఆవడం శివారులో భూ యజమానికి సమాచారం ఇవ్వకుండా కొందరు కాంగ్రెస్ నాయకుల అండతోనే చెట్ల నరికివేత జరుగుతోందని ప్రచారం సాగుతోంది. రాత్రింబవళ్లు జేసీబీలు, ట్రాక్టర్లు, లారీల సహాయంతో చెట్లను తరలిస్తున్నప్పటికీ సంబంధిత శాఖలు మాత్రం కళ్లుమూసుకుని చూస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్థులు పలుమార్లు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా అది మా పరిధిలోకి రాదు మాకు సమయం లేదు అంటూ నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు స్పందించకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

-వాల్టా చట్టం ఎక్కడ అమలవుతోంది

నీరు, భూమి, చెట్ల సంరక్షణ కోసం అమలులో ఉన్న వాల్టా చట్టం, 2002ను పూర్తిగా తుంగలో తొక్కుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా కొన్ని చెట్లు తొలగించాలన్నా అనుమతులు తప్పనిసరి కాగా, ఇక్కడ మాత్రం వందలాది మామిడి చెట్లను నరికి వేస్తున్నా కేసులు నమోదు కాకపోవడం, యంత్రాలను స్వాధీనం చేసుకోకపోవడం చర్చనీయాంశమైంది.

-పర్యావరణానికి పెను ముప్పు..

పాత మామిడి తోటలు రైతులకు ఆదాయ వనరే కాకుండా పర్యావరణ సమతౌల్యానికి కీలక ఆధారంగా నిలుస్తున్నాయి. చెట్ల నరికివేతతో ఉష్ణోగ్రతలు పెరగడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం, పక్షులు జీవరాశులకు ఆశ్రయం లేకుండా పోవడం వంటి తీవ్ర ప్రభావాలు తలెత్తే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

-ఎమ్మెల్యే స్పందించాలని గ్రామా ప్రజల డిమాండ్

ఈ వ్యవహారంపై బెల్లంపల్లి ఎమ్మెల్యే వెంటనే స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా



ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి, చెట్ల నరికివేత వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటపెట్టి ప్రకృతిని కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు..

-పచ్చని తోటలు మాయం... అధికారుల మౌనం ఎందుకు.?..

వేలాది మామిడి చెట్లు నేలమట్టమవుతున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడం ఇప్పుడు మంచిర్యాల జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. వాల్టా చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘిస్తూ యంత్రాలతో చెట్లను నరికేస్తున్నా కేసులు లేకపోవడం, బాధ్యులపై చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ అండతోనే ఈ అక్రమాలు సాగుతున్నాయా.? లేక అధికారుల నిర్లక్ష్యమే పచ్చదనాన్ని బలితీసుకుంటుందా.? అనే ప్రశ్నలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ చెట్ల నరికివేతను అడ్డుకుని, ప్రకృతిని కాపాడాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు..

# కార్మిక కుటుంబాలకు మళ్లీ ఉపాధి వెలుగు

-213 కుటుంబాలకు ఉద్యోగ భరోసా..
-మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చొరవతో గ్రీన్ సిగ్నల్..
-కార్మికుల సమస్యకు తక్షణ స్పందన..
-కష్టకాలంలో అండగా మంత్రి..

హంసకలం మే 22 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

మందమర్రి ప్రాంతంలో ఉపాధి కోల్పోయి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న 213 మంది కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయి. కాంట్రాక్టర్ గడువు ముగియడంతో ఉద్యోగాలు కోల్పోయిన ఈ కార్మికులు గత రెండు నెలలుగా ఉపాధి లేక కుటుంబ పోషణ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు దఫాలుగా అధికారులను, కార్మిక సంఘాలను ఆశ్రయించినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో కార్మికులు ఆందోళనకు గురయ్యారు. ప్రధాన కార్యాలయం చుట్టూ పలుమార్లు వినతులు సమర్పించినా పరిస్థితి మారకపోవడంతో కుటుంబాలు ఆర్థికంగా కష్టాల్లో పడ్డాయి. ఈ పరిస్థితిని గమనించిన రాష్ట్ర కార్మిక,



ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వెంటనే స్పందించారు. సమస్యను వ్యక్తిగతంగా పరిశీలించిన మంత్రి, బాధిత కార్మికులతో నేరుగా మాట్లాడి వారి పరిస్థితిని వివరంగా తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో అత్యవసరంగా సమీక్ష నిర్వహించి, వెంటనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేయడమే కాకుండా, అధికారులతో ప్రత్యేకంగా సంప్రదింపులు జరిపి సమస్యను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. మంత్రి చొరవతో సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. నూతన టెండర్ విధానం ద్వారా మరో



ఐదు రోజుల్లోనే 213 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో మందమర ప్రాంత కార్మిక కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. నెలల తరబడి అనిశ్చితిలో ఉన్న జీవనానికి ఇప్పుడు స్పష్టత రావడంతో కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు. తమ సమస్యను అత్యంత వేగంగా పరిష్కరించిన తీరుపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ, సంక్షోభ సమయంలో ముందుండి స్పందించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ స్థాయిలో జరిగిన ఈ తక్షణ చర్యలు కార్మిక వర్గంలో.విశ్వాసాన్ని మరింత పెంచినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది..

# విద్యార్థుల భద్రతకు మెగా ప్లాన్

-15 నిమిషాల్లో 2 లక్షల వాహనాలు..
-విద్యార్థుల భద్రతకు కొత్త ప్లాన్..
-526 స్కూల్స్ సర్వేలో షాక్..
-ట్రాఫిక్‌కు టెక్నాలజీ చెక్..

సైబరాబాద్, మే 22 ( హంసకలం వార్త )

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విద్యార్థుల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా స్టూడెంట్ మొబిలిటీ ప్లాన్ పేరుతో వినూత్న రవాణా విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, విద్యార్థుల భద్రత, నిబంధనల అమలు, తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణం లక్ష్యంగా ఈ భారీ ప్రణాళికను రూపొందించారు. సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా 526 విద్యాసంస్థల్లో 4.1 లక్షల మంది విద్యార్థులపై నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో రవాణా వ్యవస్థలో ఉన్న అనేక లోపాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు, తల్లిదండ్రులు, రవాణా నిర్వాహకులు, ప్రభుత్వ విభాగాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సాంకేతిక ప్లాట్‌ఫారమ్‌ను సిద్ధం చేశారు. ఈ కొత్త విధానంపై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లోని ఐఈఐ ఈఎస్‌సీఐ శతాబ్ది కన్వెన్షన్ సెంటర్‌లో భారీ సదస్సు నిర్వహించారు. సుమారు 500 విద్యాసంస్థలకు చెందిన 750 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్, ఎస్‌సీఎస్‌సీ చైర్మన్ ఎం. రమేష్ మాట్లాడుతూ.. పాఠశాలలు ముగిసే కేవలం 15




నిమిషాల వ్యవధిలోనే సైబరాబాద్ వ్యాప్తంగా దాదాపు 2 లక్షల వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయని తెలిపారు. కొన్ని రోజుల్లో ఈ రద్దీ ఐటీ కారిడార్ పీక్ అవర్స్ ట్రాఫిక్‌ను మించిపోతుందని రికార్డులు చెబుతున్నాయని వెల్లడించారు. తల్లిదండ్రులు తొందరలో అసురక్షితంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, పిల్లలు పాఠశాలల వద్ద ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయపు ఒత్తిడి పిల్లల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ఇది కేవలం ట్రాఫిక్ నియంత్రణ చర్య కాదని, భవిష్యత్ నగర రవాణా సంస్కరణకు పునాది అని ఎం. రమేష్ స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందిని కూడా లాస్ట్ మైల్ కనెక్టివిటీ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ.. విద్యార్థి ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి సురక్షితంగా ఇంటికి చేరేవరకు భద్రత బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఈ ప్రణాళిక క్షేత్రస్థాయిలో స్పష్టమైన మార్పు తీసుకొస్తుందని



చెప్పారు. ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవేద్ ఖాన్ వెల్లడించిన సర్వే వివరాల ప్రకారం, 80 శాతం విద్యాసంస్థలు రవాణా సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ, కేవలం 30 శాతం మంది విద్యార్థులే వాటిని వినియోగిస్తున్నారు. మిగిలినవారు వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణించడం వల్ల ప్రతిరోజూ భారీ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. టీజీఎస్‌ఆర్‌టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కల్యాణి మాట్లాడుతూ, విద్యార్థుల కోసం భద్రతా ప్రమాణాలతో కూడిన ప్రజా రవాణా సేవలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి రామారావు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో యువత, విద్యార్థులే ఎక్కువగా బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతను విద్యా వ్యవస్థలో భాగం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సదస్సులో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కె, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, కూకట్‌పల్లి జెడ్సీ మయాంక్ సింగ్, ఈఎస్‌సీఐ డైరెక్టర్ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయానికి అన్ని విభాగాలు పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించాయి..

## పార్టీ సేవలకు ఫలితం బండి శంకర్ గౌడ్‌కు కీలక పదవి

-బండి శంకర్ గౌడ్‌కు కాంగ్రెస్ కీలక పదవి..
-20 ఏళ్ల సేవలకు గుర్తింపు..
-ప్రజా సమస్యలపై చురుకైన నేత..
-పార్టీ బలోపేతమే లక్ష్యం..

హంసకలం మే 22 మంచిర్యాల జిల్లా ప్రతినిధి



మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్న వేళ, 21వ వార్డుకు చెందిన సీనియర్ నాయకుడు బండి శంకర్ గౌడ్‌ను పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. గత 20 సంవత్సరాలుగా రాజకీయ రంగంలో చురుకుగా కొనసాగుతూ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న బండి శంకర్ గౌడ్‌కు ఈ పదవి ఇవ్వడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటిని వెంటనే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో బండి శంకర్ గౌడ్ ముందుంటారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి ప్రజా సమస్యలను చేరవేసి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజాభిమానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడంతో పాటు యువతను కాంగ్రెస్ వైపు ఆకర్షించడంలో కూడా ఆయన సేవలు విశేషమని కొనియాడారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సేవా కార్యక్రమాల్లో బండి శంకర్ గౌడ్ చూపుతున్న చొరవను గుర్తించిన పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలు అప్పగించినట్లు మంద తిరుమల్ రెడ్డి వెల్లడించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఆయన సేవలు ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండి శంకర్ గౌడ్ ఆనందం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. మందమర్రి పట్టణ కాంగ్రెస్‌లో బండి శంకర్ గౌడ్ నియామకం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, పార్టీకి ఇది మరింత బలం చేకూర్చే నిర్ణయమని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.

## 25న కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ పవర్ సభ

-కేటీఆర్ సభతో కూకట్‌పల్లిలో రాజకీయ హీట్..
-కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఫైర్

కూకట్‌పల్లి, మే 22 ( హంసకలం వార్త )



కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఈనెల 25న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని భారీ ఎత్తున విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం తన నివాసంలో కేపీహెచ్‌బీ డివిజన్, వసంత్‌నగర్ డివిజన్‌లకు చెందిన ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 25వ తేదీ ఉదయం 9 గంటలకు కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో జరగనున్న ఈ సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, ఎమ్మెల్సీలు కుర్మయ్యగారి నవీన్‌కుమార్, శంబిపూర్ రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాయమాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని మందడి శ్రీనివాసరావు విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగాయని పేర్కొన్నారు. ప్రజలు మరోసారి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, రాబోయే రోజుల్లో పార్టీకి తిరిగి ఆదరణ పెరుగుతోందని అన్నారు. విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువత భారీగా హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎం. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## వడ్డేపల్లి నర్సింగరావుకు ఘన నివాళి

కూకట్‌పల్లి, మే 22 ( హంసకలం వార్త )





కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగరావు 12వ వర్ధంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని వడ్డేపల్లి నర్సింగరావు సర్కిల్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగరావు ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన అరుదైన నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి సేవలందించారని, రాజకీయాల్లో నిబద్ధత, విలువలు, ప్రజల పట్ల అపారమైన ప్రేమతో ప్రత్యేక గుర్తింపు సాధించారని తెలిపారు. ఆయన చూపిన సేవా మార్గాన్ని యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల స్థానిక నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగరావుకు ఘన నివాళులు అర్పించారు..

# గ్రేటర్ రేసులో కాంగ్రెస్ స్పీడ్



-గ్రేటర్‌పై కాంగ్రెస్ ఫుల్ ఫోకస్..
-కూకట్‌పల్లిలో ఎన్నికల కసరత్తు..
-బూత్ స్థాయిలో పార్టీ యాక్టివ్..
-గెలుపే లక్ష్యమంటూ నేతల ధీమా..

కూకట్‌పల్లి, మే 22 ( హంసకలం వార్త )

రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎన్నికల సన్నాహక కార్యక్రమాలను వేగవంతం చేసింది. పార్టీ బలోపేతం, బూత్ స్థాయి వ్యవస్థ పటిష్టత, కొత్త కమిటీల ఏర్పాటు లక్ష్యంగా నిర్వహించిన ముఖ్య సమావేశం రాజకీయంగా చర్చనీయాంశమైంది. నియోజకవర్గ ఎన్నికల కమిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ సాంకేతిక సేవల సంస్థ చైర్మన్ మన్నె సతీష్, కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ముఖ్యంగా హాజరయ్యారు. పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో బూత్ స్థాయి బాధ్యుల నియామకం, ప్రత్యేక గుర్తింపు నమోదు కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి డివిజన్‌లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు కొత్త కమిటీల ఏర్పాటు ద్వారా కేడర్‌ను మరింత చురుకుగా మార్చాలని నాయకత్వం దిశానిర్దేశం చేసింది. గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించేందుకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి బూత్ స్థాయి నుంచే పక్కా వ్యూహంతో ముందుకెళ్లాలని సూచించారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై పెరుగుతున్న ఆదరణను ఓట్లుగా మలచడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అదే ఉత్సాహంతో గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా కాంగ్రెస్ జెండా ఎగరవేసేందుకు ఐక్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. కూకట్‌పల్లి నుంచే గ్రేటర్ రాజకీయాలకు కొత్త సందేశం వెళ్లేలా పార్టీ శ్రేణులు కదలాలని నాయకత్వం పిలుపునివ్వగా, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘన విజయం ఖాయమని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు..

# అన్నదానంతో ఆకట్టుకున్న వెంకటేష్ గౌడ్ జన్మదిన వేడుకలు

ఆల్విన్ కాలనీ, మే 22 ( హంసకలం వార్త )



ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జన్మదిన శుభసందర్భంగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌టీఆర్ నగర్ కాలనీలోని షిరిడి సాయిబాబా ఆలయంలో వెంకటేష్ గౌడ్ పేరుమీద హారతి పూజలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని సాయినగర్ రాఘవేంద్రనగర్ కాలనీలో ఉన్న రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు అందిస్తూ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు వెంకటేష్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్, పాండుగౌడ్, చిన్నోళ్ల శ్రీనివాస్, వాసుదేవరావు, వెంకటేష్, చాణిక్య, హరీష్, కటిక రవి, సంపత్ పాల్గొన్నారు..

# శేరిలింగంపల్లిలో ఫుడ్ సేఫ్టీ అలర్ట్



శేరిలింగంపల్లి, మే 22 ( హంసకలం వార్త )

శేరిలింగంపల్లి జోన్ పరిధిలో వీధి ఆహార విక్రేతలకు ఆహార భద్రత, పరిశుభ్రత, సురక్షిత ఆహార నిర్వహణ విధానాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, అదనపు కమిషనర్ సుభద్రదేవి, ఫుడ్ సేఫ్టీ అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం వీధి ఆహార విక్రేతల్లో నాణ్యమైన ఆహార సరఫరాపై చైతన్యం కల్పించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం, 2006 నిబంధనల ప్రకారం నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వీధి ఆహార విక్రేతలు పాల్గొన్నారు. మొత్తం 110 మంది విక్రేతలు ఫుడ్ సేఫ్టీ సూపర్వైజర్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసి ధృవపత్రాలు అందుకున్నారు. శిక్షణలో భాగంగా ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత ప్రమాణాలు, వినియోగదారుల ఆరోగ్య రక్షణ, వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛత పాటించే విధానాలపై నిపుణులు వివరించారు. ముఖ్యంగా వీధి ఆహార విక్రేతలు ప్రజలకు అందించే ఆహారం పరిశుభ్రంగా, నాణ్యతతో ఉండాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న విక్రేతలకు హైజీన్ కిట్లు పంపిణీ చేసి పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెస్లే ఇండియా, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వీధి ఆహార విక్రేతల్లో ఆహార భద్రతపై బాధ్యత పెరిగి, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు..

# దొడ్ల వెంకటేష్ గౌడ్ బర్త్‌డే వేడుకల హంగామా





ఆల్విన్ కాలనీ, మే 22 ( హంసకలం వార్త )

ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జన్మదిన వేడుకలు డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. దొడ్ల వెంకటేష్ గౌడ్ కార్యాలయంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. వేడుకల సందర్భంగా చర్చి పాస్టర్లు, ముస్లిం సోదరులు దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆయురారోగ్యాలు, ప్రజాసేవ మరింత విస్తరించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అభిమానులు, నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల నాయకులు, కార్యకర్తలు, చర్చి పాస్టర్లు, ముస్లిం సోదరులు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దొడ్ల వెంకటేష్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కొంగర కలాన్‌లో ప్రగతి సమీక్ష

-కొంగర కలాన్‌లో 99 రోజుల ప్రగతి సమీక్ష..
-పేదలకు పథకాలు చేరాలన్న గాంధీ ఆదేశం..
-అర్హులకే ఇళ్లు, కార్డులు, పింఛన్లు..
-శేరిలింగంపల్లి అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు..




శేరిలింగంపల్లి, మే 22 ( హంసకలం వార్త )

కొంగర కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం రాజకీయ, పరిపాలనా వర్గాల సమక్షంలో ఘనంగా జరిగింది. సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, చైర్మన్లు కోదండారెడ్డి, చల్లా నర్సింహ రెడ్డి, మల్ రెడ్డి రామిరెడ్డి, జగదీశ్వర్, కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి పాల్గొన్నారు. సమావేశానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాజరై అధికారులకు కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. పేదల కల అయిన ఇందిరమ్మ ఇళ్లను సాకారం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందన్నారు. పాలకులుగా కాదు, ప్రజల సేవకులుగా పనిచేస్తున్నామని, ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో ఉంటుందని తెలిపారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం కేవలం కాగితాలపైనే కాకుండా ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడమే లక్ష్యమన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో 99 రోజులపాటు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని అధికారులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, వేగవంతమైన ఫైల్ క్లియరెన్స్, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సాధికారత వంటి పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చూడటం అందరి బాధ్యత అన్నారు. తెలంగాణ రైజింగ్, 2047 విజన్‌తో తెలంగాణను అన్ని రంగాల్లో ప్రపంచ స్థాయి రాష్ట్రంగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని ఆరెకపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి మినీ ఇండియా లాంటి నియోజకవర్గమని, ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని అన్నారు. మహిళల కోసం ఎల్లమ్మబండలో మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలను ఆర్థికంగా బలపర్చేందుకు మహిళా భవనం నిర్మాణం చేపడతామని చెప్పారు. నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పని చేసి ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# వరల్డ్ రికార్డుకు చేరువలో తెలుగు రాష్ట్రాల ఉష్ణోగ్రతలు

-అత్యధికం ఎక్కడ,ఎంతో తెలుసా?

మే 22 ( హంసకలం వార్త )



తెలుగు రాష్ట్రాలపై సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడా అన్నట్లుగా ఎండలు మండిపోతున్నాయి. వరల్డ్ రికార్డులు బద్దలయ్యే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ భూమిపై ఇప్పటివరకు నమోదయిన అత్యధిక ఉష్ణోగ్రతలు 56.7 డిగ్రీ సెల్సియస్.. అమెరికాలోని కాలిఫోర్నియా స్టేట్ డెత్ వ్యాలీ ప్రాంతంలో ఈ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఇండియాలో అయితే రాజస్థాన్ లోని పలోడి ప్రాంతంలో నమోదైన 51 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలే అత్యధికం. అయితే ఈ రికార్డులను బద్దలుగొట్టేలా తెలుగు రాష్ట్రాల్లో టెంపరేచర్స్ నమోదవుతున్నాయి. భానుడి భగభగలకు అనేక ప్రాంతాలు అగ్నిగుండాల్లా మారాయి. ఇప్పటికే ఎండలు మాడు పగలగొట్టేలా కాస్తున్నాయి. అయితే రాబోయే రోజుల్లో మరింత పెరుగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు మరింత కంగారు పెడుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోత, వడగాలులు తెలుగు ప్రజలను సతమతం చేస్తున్నాయి. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే కేవలం మే 21 (గురువారం) ఒక్కరోజే తెలంగాణ వ్యాప్తంగా 22 మంది వడదెబ్బతో ప్రాణాలు వదిలారు. దీంతో రాబోయే వారం పదిరోజులు పగటిపూట ప్రజలెవ్వరూ రోడ్లపైకి రావద్దని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ లో ఎండలు తారాస్థాయికి చేరాయి మిట్టమధ్యాహ్నం స్యూర్యుడు నడినెత్తిపైకి వచ్చి నిప్పులు కురిపిస్తున్నాడు. అత్యధికంగా పల్నాడు జిల్లాలో 48 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అంటే ఇండియాలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలకంటే కేవలం 3 డిగ్రీలే తక్కువ. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1, మార్కాపురం జిల్లా నందనమారెల్లులో 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక బాపట్లలో జిల్లా వేటపాలెంలో 47.6, కృష్ణా జిల్లా నందివాడలో 47.6, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడి పాడులో 47.4, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3, మార్కాపురం జిల్లా నందన మారెల్లులో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా, 150 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

**-తెలంగాణలో కూడా ఎండలు మండిపోతున్నాయి**

రోహిణి కార్తె కంటే ముందే రోకళ్లు పగిలే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మే 22, శుక్రవారం అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఉదయం పూట అత్యల్పంగా నల్గొండ జిల్లాలో 26 డిగ్రీలు నమోదయ్యాయి. జిల్లాల వారిగా చూసుకుంటే.. .నిజామాబాద్ లో 44.9, ఆదిలాబాద్ లో 44.8, హన్మకొండ 44.5, రామగుండంలో 44.3, భద్రాచలంలో 44.2 డిగ్రీల హయ్యెస్ట్ టెంపరేచర్స్ నమోదయ్యాయి. కేవలం ఈ జిల్లాల్లోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా మిగతా జిల్లాల్లోనూ 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు ఉన్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో కూడా మామూలు ఎండలు కాయడం లేదు. దీంతో వడగాలులు, ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాజేంద్ర నగర్ లో అత్యధికంగా 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక బేగంపేటలో 43, హయత్ నగర్ లో 42, హాకీంపేటలో 42.6, పటాన్ చెరువులో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలున్నాయి.

# వృద్ధులను టార్గెట్ చేస్తూ రాబరీలు,చైన్ స్నాచింగ్‌లు







**-అంతర్ జిల్లా గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన నల్గొండ జిల్లా పోలీసులు**

**-రూ.22 లక్షల విలువైన బంగారం, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

**-జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడి**

మే 22 ( హంసకలం వార్త )

నల్గొండ జిల్లా నేషనల్ హైవే పరిధిలో వృద్ధులు,మహిళలను లక్ష్యంగా చేసుకుని వరుస రాబరీలు,చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నేరగాళ్ల గ్యాంగ్‌ను నల్గొండ జిల్లా సీసీఎస్ పోలీసులు,కట్టంగూర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుంచి సుమారు రూ.22 లక్షల విలువైన 75 గ్రాముల బంగారు ఆభరణాలు,ఒక హ్యుందాయ్ వెర్నా కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. అరెస్టయిన నిందితులు పాకాల ధర్మ తేజ --చిన్న బీరెల్లి గ్రామం,బోనకల్ మండలం,ఖమ్మం జిల్లా. షేక్ చాంద్ పాషా --రావినూతల గ్రామం, బోనకల్ మండలం,ఖమ్మం జిల్లా.సయ్యద్ రంజాన్ వలి --నందిగామ టౌన్,ఎన్టీఆర్ జిల్లా. కేసుల వివరాలు కట్టంగూర్,నార్కెట్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పలు రాబరీ,చైన్ స్నాచింగ్ కేసుల్లో ఈ గ్యాంగ్ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.తేదీ 10-03-2026 రాత్రి కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం సమీపంలో బుల్లెట్ బైక్‌పై వస్తున్న అయితగొని సునీల్‌ను కారులో వచ్చిన ముగ్గురు దుండగులు అడ్డగించి,చంపేస్తామని బెదిరించి మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్ లాక్కొని పరారయ్యారు.బాధితుడు 15-05-2026న కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.16-05-2026న కట్టంగూర్ నల్గొండ ఎక్స్ రోడ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో షేక్ చాంద్ పాషా పట్టుబడగా, నేరానికి ఉపయోగించిన యూ08-ఖీశ-1231 నంబర్ గల హ్యుందాయ్ వెర్నా కారు,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న పాకాల ధర్మ తేజ,సయ్యద్ రంజాన్ వలి కోసం పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గాలింపు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరు నిందితులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా,వెంటనే వెంబడించి అదుపులోకి తీసుకున్నారు.

**-నిందితుల మోడ్ ఆఫ్ ఆపరేషన్**

సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య హైవే వెంట ఒంటరిగా వెళ్తున్న వృద్ధులు, మహిళలు,బస్ సౌకర్యం లేని ప్రాంతాల్లో నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులను టార్గెట్ చేసి బెదిరించి,కొట్టి బంగారు ఆభరణాలు దోచుకునేవారని పోలీసులు వెల్లడించారు.గత ఐదేళ్లుగా ఖమ్మం,కోదాడ,సూర్యాపేట, చౌటుప్పల్ ప్రాంతాల్లో డకైటీలు,రాబరీలు,చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ మొత్తం 18 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

**-ప్రజలకు ఎస్పీ సూచనలు**

వేసవికాలంలో గ్రామాల్లో నేరస్తుల సంచారం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. మహిళలు రాత్రివేళల్లో ఒంటరిగా బంగారు ఆభరణాలతో బయటకు వెళ్లవద్దని,డాబాలపై ఆభరణాలతో నిద్రించవద్దని హెచ్చరించారు.గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాల ఛేదన వేగంగా జరుగుతుందని తెలిపారు.

**-పోలీసు బృందానికి రివార్డులు**

ఈ కేసును ఛేదించిన సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి, సీఐ చంద్రశేఖర్ రెడ్డి,ఇన్చార్జ్ సీఐ రాఘవరావు,ఎస్సైలు రవీందర్,విజయ్ కుమార్, సీసీఎస్ సిబ్బంది మరియు కట్టంగూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం







**-జిల్లా అభివృద్ధిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**-మహిళా సంఘాల భవనాలకు వెంటనే నిధుల మంజూరు**

**-గ్రామీణ మహిళల కోసం రూ.10 లక్షలతో షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశం**

**-ప్రత్యేక అవసరాల పిల్లలకు 342 పరికరాల పంపిణీ**

మే 22 ( హంసకలం వార్త )

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ పిలుపు జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు సమష్టిగా పనిచేస్తూ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి నివేదికపై స్థానిక రవి మహల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి పాల్గొన్న ఆయన, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు అధికారులు ప్రజలకు అండగా నిలవాలని, కార్యాలయ పరిమితుల్లో కాకుండా గ్రామస్థాయిలోకి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా అమలు అయితేనే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.

**-మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం**

గ్రామాల్లో మహిళా సంఘాలకు స్వంత భవనాలు లేకుంటే సంబంధిత ఎంపీడీఓల ద్వారా వెంటనే ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాలకు శాశ్వత వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 370కు పైగా మహిళా సంఘ భవనాల ప్రతిపాదనలు అందగా, అందులో ఇప్పటికే 200 భవనాలకు గ్రౌండింగ్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా గ్రామీణ మహిళల సౌకర్యార్థం రూ.10 లక్షల వ్యయంతో షెడ్లు నిర్మించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, వీటి కోసం కూడా అధికారులు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

**-ప్రత్యేక అవసరాల పిల్లలకు 342 ప్రత్యేక పరికరాల పంపిణీ**

దివ్యాంగుల సంక్షేమంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 50 మంది ప్రత్యేక అవసరాల పిల్లల కోసం రూపొందించిన 342 ప్రత్యేక పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరికరాలను ఏ ఎల్ ఐ యం సి ఓ సంస్థ ద్వారా నాణ్యతా ప్రమాణాలతో ప్రత్యేకంగా తయారు చేయించినట్లు తెలిపారు. ఈ పరికరాలు ప్రత్యేక అవసరాల పిల్లలకు సాధారణ జీవనంలో ఎంతో ఉపయోగపడతాయని, వారికి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లాలో సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

**-మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలి**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ సమాజాన్ని నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యార్థులను గంజాయి వంటి మాదకద్రవ్యాలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించిన ఎస్పీ, ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా సెంటర్లు, షీ టీమ్స్, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు మరింత సమర్థంగా పనిచేస్తాయని స్పష్టం చేశారు.

**-పోలీస్ శాఖ స్టాల్ సందర్శించిన కలెక్టర్, ఎస్పీ**

ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాల నివారణ, మహిళా భద్రత, రోడ్డు భద్రతపై రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. పోలీస్ శాఖ తరపున క్షేత్రస్థాయిలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను ఎస్పీ నరసింహ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమం అనంతరం విధి నిర్వహణలో మరణించిన ఇద్దరు ఉద్యోగుల పిల్లలకు జిల్లా కలెక్టర్ కారుణ్య నియామక ఉత్తర్వుల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరిసింగ్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, సీపీఓ కిషన్, డీఎస్‌సీడీఓ దయానందరాణి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మంజీర పైప్‌లైన్ బద్దలాటం నీటి కలకలం



రామచంద్రపురం, మే 22 ( హంసకలం వార్త )

రామచంద్రపురం డివిజన్‌లో తాగునీటి సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి. నిన్న రాత్రి జాతీయ రహదారి వద్ద మంజీర తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో సమీపంలోని ఓ షాపులోకి భారీగా నీరు చేరి నష్టం వాటిల్లింది. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నేడు జలమండలి అధికారులను సంఘటనా స్థలానికి పిలిపించి పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించారు. కాలనీలో సరైన తాగునీటి సరఫరా లేకపోవడం, అందుతున్న నీరు కూడా తరచూ కలుషితంగా వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరమేష్ యాదవ్ అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు శుద్ధమైన తాగునీటిని అందించడం అధికారుల బాధ్యత. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. తాగునీటిలో మురుగునీరు కలవడం ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడటమే అని ఆయన మండిపడ్డారు. పైప్‌లైన్ పగిలిన సందర్భాల్లో వెంటనే స్పందించి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని, సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సాయి నగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు పెంట రెడ్డి, జైపాల్ రెడ్డి, నారాయణ, రాజు, భూపాల్ రెడ్డి, మురళి రెడ్డి, రాంబాబు, అప్పల భాస్కర్, బలరాం, నాగేష్‌తో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు..

# అధికారం అంటే అహంకారం కాదు ఆప్యాయత అని చూపించిన కలెక్టర్

**-ఉపాధి కూలీ అవ్వ చేతులు పట్టుకుని పరామర్శించిన సూర్యాపేట కలెక్టర్ ం తేజస్ నందలాల్ పవార్**

**-అమ్మా...మీరు దీవించాలి గానీ చేతులు జోడించొద్దు అన్న కలెక్టర్**

**-ఆ మాటలకు కదిలిన గ్రామస్తుల హృదయాలు**



మే 22 ( హంసకలం వార్త )


ప్రభుత్వ అధికారులంటే ప్రజల్లో ఇప్పటికీ ఒక భయం,దూరం, గౌరవం కలగలిపిన భావన ఉంటుంది.అధికారంలోకి వెళ్లిన కొందరు ప్రజలకు అందని ఎత్తులో ఉంటారు.కానీ,కొందరు అధికారులు మాత్రం తమ పదవిని ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తారు. అలాంటి అరుదైన సంఘటన ఒకటి సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది.అధికారం అంటే హోదా కాదని,మనిషి మనసును అర్థం చేసుకునే బాధ్యత అని మరోసారి నిరూపించారు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్.మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామం చెరువు వద్ద గురువారం ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు కలెక్టర్ వెళ్లారు.అప్పటికే మండుతున్న ఎండల్లో కూలీలు తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కలెక్టర్ అకస్మాత్తుగా అక్కడికి రావడంతో కూలీలు ఒక్కసారిగా ఆయన చుట్టూ చేరారు.ఈ సందర్భంగా సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు ఎలాంటి సంకోచం లేకుండా ముందుకు వచ్చి కలెక్టర్ చేతులు పట్టుకుని తమ కష్టాలను కన్నీటి పర్యంతమై వివరించింది.ఆ దృశ్యం అక్కడున్న వారిని కదిలించింది.సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో అధికారులు దూరంగా నిలబడతారని భావించే ప్రజలకు భిన్నంగా కలెక్టర్ స్పందించారు. "అవ్వా...బాగున్నావా?" అంటూ ఆ వృద్ధురాలి చేతులను తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా పలకరించారు.ఆమె చెప్పిన ప్రతి మాటను ఓపికగా విన్నారు."మీరు పెద్దవారు...మాకు దీవెనలు ఇవ్వాలి గానీ చేతులు జోడించొద్దు" అంటూ చెప్పిన మాటలు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేశాయి.ఆ క్షణంలో అక్కడ కలెక్టర్--కూలీ అనే తేడా కనిపించలేదు.ఒక కొడుకు...ఒక తల్లి మధ్య ఉండే ఆప్యాయత మాత్రమే కనిపించింది.ప్రజల సమస్యలు వినడానికి వచ్చిన అధికారి,ప్రజలతో కలిసిపోయి మాట్లాడితే ఎంత విశ్వాసం పెరుగుతుందో ఈ ఘటన స్పష్టంగా చూపించింది.ఈ రోజుల్లో కొందరు అధికారులు ప్రజలతో మాట్లాడేటప్పుడు కూడా హోదా, అహంకారం ప్రదర్శిస్తుంటారు. కార్యాలయాల చుట్టూ ప్రజలను తిరగబెడుతూ,సమస్యలు వినకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు తరచూ వినిపిస్తుంటాయి.అలాంటి పరిస్థితుల్లో సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వ్యవహరించిన తీరు అనేకమంది అధికారులకు కనువిప్పు కలిగించేలా ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. అధికారం ప్రజలపై చూపించడానికి కాదు,ప్రజలకు అండగా నిలబడటానికి అన్న సందేశాన్ని ఆయన తన ప్రవర్తనతో చాటి చెప్పారు.భయంతో కాదు,భక్తితో, విశ్వాసంతో ప్రజలు అధికారిని దగ్గరకు తీసుకునేలా చేసే నిజమైన పరిపాలన ఇలాగే ఉండాలని పలువురు పేర్కొంటున్నారు. పేదరికం మనుషులను చిన్నవారిని చేయదు,మనసు చిన్నదైతేనే మనిషి చిన్నవాడవుతాడనే జీవిత సత్యాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.అధికార హోదా కన్నా మానవత్వమే గొప్పదని,ప్రజల మనసు గెలుచుకున్న అధికారులే నిజమైన ప్రజాసేవకులని పోలుమల్ల గ్రామంలో చోటుచేసుకున్న ఈ సంఘటన స్పష్టంగా తెలియజేసింది.

## బిజినెస్

# భారత్‌లో ఈ-బైక్‌ల జోరు..

## రికార్డు స్థాయిలో 14 లక్షల రిజిస్ట్రేషన్లు

భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ టూవీలర్ (ఈ-టూవీలర్) సెగ్మెంట్ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఏకంగా 14 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. ఈ గణాంకాలను వాహన్ పోర్టల్ డేటా ఆధారంగా స్టాటిస్టా సంస్థ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన 12 లక్షల యూనిట్లతో పోలిస్తే ఇది 22 శాతం అధికం. దేశంలో అమ్ముడవుతున్న మొత్తం ఎలక్ట్రిక్ వాహనాల్లో దాదాపు 10లో 6 వాహనాలు ఎలక్ట్రిక్ టూవీలర్లే కావడం గమనార్హం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వాహన రిజిస్ట్రేషన్లలో ఈ-టూవీలర్ల వాటా 6.5 శాతంగా నమోదైంది. ఈ విభాగంలో టీవీఎస్ మోటార్ కంపెనీ 3,41,513 యూనిట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత బజాజ్ ఆటో (2,89,349 యూనిట్లు), ఏథర్ ఎనర్జీ (2,39,178 యూనిట్లు) ఉన్నాయి. 2026 మార్చిలో రిజిస్ట్రేషన్లు రికార్డు స్థాయికి చేరడం ఈ వృద్ధికి దోహదపడింది. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద సబ్సిడీలను 2026 జులై 31 వరకు పొడిగించడం, అధిక ఇంధన ధరలు అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. కొత్త ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ జోరు కొనసాగుతోంది. 2026 ఏప్రిల్ లో 1,48,740 ఈ-టూవీలర్లు రిజిస్టర్ కాగా, ఇది గతేడాదితో పోలిస్తే 61 శాతం పెరుగుదల. మే మధ్య నాటికి వెలువడిన ప్రాథమిక గణాంకాల ప్రకారం, మార్కెట్‌లో టీవీఎస్ 25 శాతం వాటాను కలిగి ఉండగా, బజాజ్ 23 శాతంతో గట్టి పోటీ ఇస్తోంది. విశాలమైన పంపిణీ నెట్‌వర్క్‌లు ఉన్న ప్రముఖ తయారీదారులు ఈ పోటీలో మార్కెట్ వాటాను పెంచుకుంటున్నారని పరిశ్రమ విశ్లేషకులు చెబుతున్నారు. తక్కువ ఖర్చు, పర్యావరణ అనుకూల రవాణాకు వినియోగదారులు మొగ్గుచూపడం, ప్రభుత్వ విధానాలు కలిసి భారతదేశ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రయాణంలో ఈ-స్కూటర్లు, మోటార్‌సైకిళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.




### రూపాయి జోరు, బ్యాంకింగ్ షేర్ల మద్దతు...

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు



అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ భారీగా బలపడటం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 231.99 పాయింట్లు లాభపడి 75,415.35 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 64.60 పాయింట్లు పెరిగి 23,719.30 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి బలం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను పెంచింది. డాలర్‌తో పోలిస్తే ఒక దశలో 51 పైసలు బలపడి 95.69 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకిన రూపాయి, చివరకు కొన్ని లాభాలను కోల్పోయి 96.20 వద్ద స్థిరపడింది. ఈ సెషన్‌లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ కౌంటర్లపై దృష్టి కేంద్రీకృతం కావడంతో నిఫ్టీలో ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంక్ నిఫ్టీ సూచీలు లాభపడగా ఫార్మా, హెల్త్‌కేర్, మీడియా రంగాల షేర్లు నష్టాలను చవి చూశాయి. బ్రాడర్ మార్కెట్‌లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.14 శాతం లాభంతో ముగియగా, స్మాల్‌క్యాప్ 0.15 శాతం స్వల్పంగా నష్టపోయింది. సాంకేతికంగా నిఫ్టీకి తక్షణ మద్దతు 23,600 వద్ద ఉందని, ఈ స్థాయిని కోల్పోతే 23,400 వరకు పడిపోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, 23,800 స్థాయిని నిలకడగా దాటితే స్వల్పకాలంలో కొత్త అప్‌మూవ్ రావచ్చని అంచనా వేశారు. భౌగోళిక రాజకీయ స్థిరత్వం, ముడిచమురు ధరల తగ్గుదల వంటివి స్థూల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిస్తేనే మార్కెట్‌లో స్థిరమైన అప్‌ట్రెండ్ సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

## మొత్తం హెచ్‌ఆర్ విభాగాన్ని ఎత్తేసిన సీఈఓ.. కారణం ఇదే




అమెరికాకు చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ స్టార్టప్ కంపెనీ 'బోల్ట్' సీఈఓ ర్యాన్ బ్రెస్లో సంచలన నిర్ణయం తీసుకున్నారు. కంపెనీలో ఉన్న హ్యూమన్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్ (హెచ్‌ఆర్ విభాగం) మొత్తాన్ని ఆయన ఉద్యోగాల నుంచి తొలగించారు. హెచ్‌ఆర్ టీమ్ అంతా కలిసి లేని సమస్యలను సృష్టిస్తోందని, వారిని తీసేసిన మరుక్షణమే ఆ సమస్యలన్నీ మాయమైపోయాయని ఆయన ప్రకటించడం ఇప్పుడు కార్పొరేట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. కంపెనీ విలువ భారీగా పడిపోవడంతో రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా ఏప్రిల్‌లో 30 శాతం మంది ఉద్యోగులను తొలగించినట్లు బ్రెస్లో తెలిపారు. ఫార్చ్యూన్ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పెద్ద కంపెనీలకే హెచ్‌ఆర్ వ్యవస్థ సెట్ అవుతుందని, ఎదుగుతున్న తమలాంటి స్టార్టప్‌లకు పని పూర్తి చేయడంపై శ్రద్ధ పెట్టే టీమ్ మాత్రమే అవసరమని స్పష్టం చేశారు. కంపెనీలో పని చేయకుండా కేవలం సౌకర్యాలు కోరుకునే సంస్కృతి పెరిగిపోయిందని అందుకే వీరందరినీ తొలగించి వారానికి 4 రోజుల పని విధానాన్ని, అన్‌లిమిటెడ్ లీవ్స్ పాలసీలను రద్దు చేసినట్లు వెల్లడించారు.

## చెన్నైకి డబుల్ షాక్: ప్లేఆఫ్స్ నుంచి ఔట్.. జట్టుకు భారీ జరిమానా!



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ప్రస్థానం నిరాశగా ముగిసింది. గురువారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 89 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలవ్వడమే కాకుండా, ప్లేఆఫ్స్ రేసు నుంచి కూడా నిష్క్రమించింది. మ్యాచ్ ఓటమితో పాటు స్లో ఓవర్ రేట్ కారణంగా జట్టుకు భారీ జరిమానా పడటం సీఎస్‌కేకి మరో పెద్ద దెబ్బగా మారింది. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ నిర్దేశించిన 230 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన చెన్నై, ఆరంభంలోనే వికెట్ కీపర్ సంజూ శాంసన్‌ను గోల్డెన్ డక్‌గా కోల్పోయి కష్టాల్లో పడింది. శివమ్ దూబే కేవలం 17 బంతుల్లో 47 పరుగులు చేసి మెరుపులు మెరిపించినా, అది జట్టును గెలిపించడానికి సరిపోలేదు. చివరకు చెన్నై టోర్నమెంట్ నుంచే నిష్క్రమించాల్సి వచ్చింది. మ్యాచ్ అనంతరం ఐపీఎల్ పాలక మండలి సీఎస్‌కే జట్టుకు కఠిన శిక్ష విధించింది. స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రూ. 24 లక్షల జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఇది రెండోసారి చేసిన తప్పిదం కావడంతో శిక్ష తీవ్రతను పెంచారు. కెప్టెన్‌తో పాటు ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా తుది జట్టులోని మిగతా సభ్యులందరికీ తలా రూ. 6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం (ఏది తక్కువైతే అది) జరిమానాగా విధిస్తున్నట్లు ఐపీఎల్ అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ధోనీ భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి, పలువురు ఆటగాళ్ల విఫలమవడం వంటి కారణాలతో వచ్చే సీజన్‌కు ముందు చెన్నై జట్టులో కీలక మార్పులు జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## టాప్ ప్లేసు పై కన్నేసిన ఎస్‌ఆర్‌హెచ్.. ఎలా సాధ్యమంటే



ఐపీఎల్ 2026 లీగ్ స్టేజ్ ముగింపు దశకు చేరడంతో ప్లేఆఫ్స్ సమీకరణాలు ఉత్కంఠ రేపుతున్నాయి. గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై గుజరాత్ టైటాన్స్ భారీ తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో గుజరాత్ 18 పాయింట్లతో పట్టికలో మొదటి రెండు స్థానాల్లో ఒక స్థానాన్ని పక్కా చేసుకుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో మొదటి మూడు స్థానాల్లో ఉన్న బెంగళూరు (18 పాయింట్లు), గుజరాత్ (18 పాయింట్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (16 పాయింట్లు) జట్లు ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అధికారికంగా అర్హత సాధించాయి. మిగిలిన ఏ జట్లు కూడా ఈ పాయింట్లను దాటలేవు. కాబట్టి ఈ మూడు జట్లు మొదటి మూడు స్థానాలను పంచుకోవడం ఖాయమైంది. అయితే ప్లేఆఫ్స్‌లో మొదటి రెండు స్థానాల కోసం ప్రస్తుతం బెంగళూరు, హైదరాబాద్ జట్ల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. ఇక ఖాళీగా ఉన్న చివరిదైన నాలుగో ప్లేఆఫ్స్ స్థానం కోసం రాజస్థాన్, పంజాబ్, కోల్‌కతా జట్లు తలపడుతున్నాయి.

### టాప్-2 కోసం సన్‌రైజర్స్ ఏం చేయాలి

ఐపీఎల్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచే జట్లకు ఫైనల్ చేరడానికి రెండు అవకాశాలు (క్వాలిఫయర్-1, ఎలిమినేటర్) దక్కుతాయి. గురువారం నాటి గెలుపుతో గుజరాత్ ఒక స్థానాన్ని దక్కించుకోగా.. మిగిలిన ఒక స్థానం కోసం ఈరోజు హైదరాబాద్ వేదికగా సన్‌రైజర్స్, బెంగళూరు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ టాప్-2లోకి వెళ్లాలంటే ముందుగా బ్యాటింగ్ చేస్తే కనీసం 87 పరుగుల తేడాతో గెలవాలి. ఒకవేళ ఛేజింగ్ చేయాల్సి వస్తే 11 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకోవాలి. అప్పుడు రన్‌రేట్ పరంగా ఎస్‌ఆర్‌హెచ్ ముందంజ వేస్తుంది. లేదంటే మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది.

## స్పోర్ట్స్

### కామెంటరీ బాక్స్‌లో నోరు నొక్కేస్తున్నారు




క్రికెట్‌లో మైక్ పట్టుకుని ప్యాషన్‌తో చేసే కామెంటరీ వెనుక ఉండే కఠినమైన నియమాలు, నియంత్రణల పై భారత మాజీ క్రికెటర్ శివరామకృష్ణన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లైవ్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు కామెంటరీ చెప్పే వారికి అసలు పూర్తి స్వేచ్ఛే ఉండదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కామెంటరీ బాక్స్‌లో కూర్చుని అద్భుతంగా మాట్లాడుతున్నారని చాలా మంది అభిమానులు అనుకుంటారని, కానీ అక్కడ పరిస్థితి నరకంలా ఉంటుందని ఆయన తెలిపారు. మైక్ ఆన్ చేయక ముందే బ్రాడ్‌కాస్టర్లు, బోర్డు ప్రతినిధులు కొన్ని స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇస్తారని పేర్కొన్నారు. ఫలానా ఆటగాడిని ఎక్కువగా విమర్శించకూడదని, వివాదాస్పద నిర్ణయాలు లేదా పిచ్ నాణ్యత గురించి నెగెటివ్‌గా మాట్లాడకూడదంటూ ముందే నోరు నొక్కేస్తారని కామెంట్ చేశారు. తాము కేవలం వారు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను, వారు కోరుకున్న అభిప్రాయాలనే మైక్ ముందు చెప్పాల్సి వస్తుందని వాపోయారు. ముఖ్యంగా భారీ టీ20 లీగ్స్, ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో ఈ నియంత్రణ మరీ ఎక్కువగా ఉంటోందని లక్ష్మణ్ శివరామకృష్ణన్ ఆరోపించారు. నిష్పక్షపాతంగా లోపాలను ఎత్తిచూపాలని చూస్తే.. తదుపరి సిరీస్‌లకు కాంట్రాక్టుల నుంచి తొలగిస్తామనే పరోక్ష హెచ్చరికలు వస్తాయన్నారు. కేవలం కెరీర్ కోసం, డబ్బుల కోసమే చాలామంది బ్రాడ్‌కాస్టర్లు చెప్పినట్లే తలలూపుతున్నారని ఆయన విమర్శించారు.

## 'బాహుబలి' బడ్జెట్ గురించి తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు



ఒకప్పుడు టాప్ స్టార్ హీరోల సరసన నటిస్తూ సౌత్ ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ అగ్ర తారగా ఒక వెలుగు వెలిగింది మిల్కీ బ్యూటీ తమన్నా. అయితే, ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్‌కు కాస్త దూరమై, బాలీవుడ్‌లోనే వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. తాజాగా తమన్నా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మైల్‌స్టోన్ హిట్‌గా నిలిచిన 'బాహుబలి' చిత్రం గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తమన్నా తన ఇంటర్వ్యూలో బాహుబలి బడ్జెట్, ట్రేడ్ రిస్క్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. "నేటి పరిస్థితులను బట్టి ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే బాహుబలి కోసం తీసుకున్న ప్రతి నిర్ణయం అద్భుతమైనదిగా అనిపిస్తోంది. కానీ ఆ సినిమా తీస్తున్న సమయంలో ట్రేడ్ లెక్కలు పూర్తిగా భిన్నంగా ఉండేవి. కేవలం ఒక ప్రాంతీయ భాషకు సంబంధించిన సినిమా కోసం ఆ రోజుల్లోనే రూ. 200 కోట్ల బడ్జెట్‌ను ఖర్చు చేయడం సాధారణమైన విషయం కాదు. అప్పటి మార్కెట్ పరిస్థితులను బట్టి వ్యాపార పరంగా చూస్తే.. అది ఫ్లాప్‌కు దారితీసే అత్యంత ప్రమాదకరమైన మార్గం లాగా అనిపించింది.

## 'పెద్ది' స్పెషల్ సాంగ్ ప్రోమో.. స్టెప్పులతో కిక్కెక్కించిన చరణ్, శృతి





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది' పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. గ్రామీణ క్రీడా నేపథ్యంతో దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రచార కార్యక్రమా ల్లో వేగం పెంచిన చిత్రబృందం, తాజాగా అభిమానులకు ఓ అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం 'హెల్లల్లల్లో'కు సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. ఈ ప్రోమోలో రామ్ చరణ్, శృతి హాసన్ తమ డ్యాన్స్ స్టెప్పులతో అభిమానులకు మంచి కిక్ ఇచ్చారు. భోపాల్ వేదికగా రేపు భారీ స్థాయిలో సంగీత వేడుక నిర్వహించనున్న నేపథ్యంలో ఈ ప్రోమోను విడుదల చేయడం విశేషం. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ఆస్కార్ విజేత, సంగీత దిగ్గజం ఏ.ఆర్. రెహమాన్ స్వరాలు సమకూర్చారు. రెహమాన్ సంగీతం అనగానే ప్రేక్షకుల్లో సహజంగానే భారీ అంచనాలు ఉంటాయి. దానికి తోడు ఇది స్పెషల్ సాంగ్ కావడంతో ఈ పాటపై ఆసక్తి రెట్టింపు అయింది. రేపు ఈ పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ పాటపై మరో ఆసక్తికరమైన చర్చ కూడా సోషల్ మీడియాలో జరుగుతోంది. ఇందులో మరో కథానాయిక కూడా కనిపించనున్నారని, ఆమె ఎవరనే విషయాన్ని చిత్రబృందం రహస్యంగా ఉంచిందని ప్రచారం సాగుతోంది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే భారీ హైప్ ఉన్న ఈ చిత్రానికి, ఈ స్పెషల్ సాంగ్ మరింత ఊపును తెచ్చింది.

## పొలిటికల్ ఎంట్రీ పై తిరుగులేని క్లారిటీ ఇచ్చిన రామ్ చరణ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు స్పష్టత ఇచ్చారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని, సినిమా రంగంలో అగ్రస్థానానికి చేరడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "అభిమానులు మిమ్మల్ని సీఎంగా చూడాలనుకుంటున్నారు, మీరు రాజకీయాల్లోకి వస్తారా?" అన్న ప్రశ్నకు చరణ్ బదులిస్తూ.. "రెండు పడవలపై ప్రయాణం చేయాలనుకోవడం లేదు. నా పూర్తి దృష్టి నటనపైనే ఉంది... నటనా రంగంలో మేటిగా నిలవడంపైనే నా దృష్టంతా!" అని అన్నారు. తన కొత్త సినిమా 'పెద్ది' గురించి మాట్లాడుతూ, ఇది తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో, తన అస్తిత్వాన్ని వెతుక్కునే 'పెద్ది' అనే యువకుడిగా కనిపిస్తానని వివరించారు. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టపడ్డానని చెప్పారు. క్రీడా నేపథ్య డ్రామాగా వస్తున్న ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రిస్కీ షాట్‌లలో డూప్‌ల సహాయం లేకుండా నటించడానికే ఇష్టపడతానని, తన తండ్రి చిరంజీవి 71 ఏళ్ల వయసులో కూడా స్టంట్స్ చేస్తున్నారని, అలాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయని రామ్ చరణ్ పేర్కొన్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'పెద్ది' చిత్రం జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## కంగనా రనౌత్‌కు రహస్యంగా పెళ్లయిందా?.. వైరల్ అయిన మంగళసూత్రం వీడియో..



నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ రహస్యంగా పెళ్లి చేసుకున్నారా? సోషల్ మీడియాలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. మెడలో మంగళసూత్రంతో కంగనా కనిపించిన ఒక వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో ఈ ఊహాగానాలకు తెరలేచింది. అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా సినిమా చిత్రీకరణలో భాగమని తేలింది.

### ఏం జరిగింది?

ప్రముఖ ఫోటోగ్రాఫర్ వైరల్ భయానీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కంగనా రనౌత్‌కు సంబంధించిన ఒక వీడియోను షేర్ చేశారు. అందులో కంగనా సంప్రదాయ దుస్తుల్లో, మెడలో మంగళసూత్రంతో కనిపించారు. ఈ వీడియో చూసిన అభిమానులు, నెటిజన్లు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. కంగనా ఎవరికీ చెప్పకుండా రహస్యంగా పెళ్లి చేసుకున్నారేమోనని కామెంట్ల రూపంలో ప్రశ్నల వర్షం కురిపించారు. కంగనా వైపు నుంచి గానీ, ఆమె బృందం నుంచి గానీ వెంటనే ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది.

### అసలు నిజం ఇదే!

అయితే, ఈ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టమైంది. కంగనా ధరించిన మంగళసూత్రం ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించింది కాదు. 2014లో విడుదలై భారీ విజయం సాధించిన 'క్వీన్' సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'క్వీన్ 2' సినిమాలోని పాత్ర కోసం ఆమె ఆ లుక్‌లో కనిపించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అందులో భాగంగానే కంగనా ఈ గెటప్‌లో ఉన్నారని తెలిసింది. 'క్వీన్ 2' చిత్రాన్ని నిర్మిస్తున్న విషయాన్ని దర్శకుడు వికాస్ బహల్ సైతం ఇటీవల ధృవీకరించారు. "మేము కొంతకాలంగా 'క్వీన్ 2'పై పనిచేస్తున్నాం. చివరికి ఒక స్పష్టమైన రూపం వచ్చింది" అని ఆయన పింక్‌విల్లాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మొదటి భాగంలో పెళ్లి రద్దవ్వడంతో ఒంటరిగా హనీమూన్‌కు యూరప్ వెళ్లే 'రాణి మెహ్రా' అనే యువతి పాత్రలో కంగనా నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్ వస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## దేవుడు చనిపోతే ఎలా.. అందుకే మైఖేల్ జాక్సన్‌ను ద్వేషిస్తున్నా: రామ్ గోపాల్ వర్మ



విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, పాప్ సామ్రాట్ మైఖేల్ జాక్సన్‌కు భావోద్వేగభరిత నివాళి అర్పించారు. ఇటీవల మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. జాక్సన్ మరణించి, తను కూడా ఒక సాధారణ మనిషే అని నిరూపించుకున్నందుకు అతడిని ద్వేషిస్తున్నానంటూ తనదైన శైలిలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సినిమా తనను 2009 జూన్ 25 నాటి భయంకరమైన రోజులోకి తీసుకెళ్లిందని, అందుకే ఆ సినిమాను కూడా ద్వేషిస్తున్నానని వర్మ పేర్కొన్నారు. "ఆ రోజు ఉదయం నిద్రలేవగానే టీవీ స్క్రీన్‌పై 'మైఖేల్ జాక్సన్ ఈజ్ డెడ్' అనే అక్షరాలు కనిపించాయి. చాలా సేపటి వరకు అదొక పీడకల అనుకున్నాను. కానీ, ఏ ఛానల్ మార్చినా అదే వార్త. అసాధ్యం సుసాధ్యమైందని అప్పుడు అర్థమైంది" అంటూ జాక్సన్ మరణవార్త తనను ఎంతగా కలచివేసిందో వర్మ వివరించారు. ఈ సందర్భంగా 1984లో విజయవాడలోని తన ఇంజనీరింగ్ రోజుల నాటి జ్ఞాపకాలను వర్మ గుర్తుచేసుకున్నారు. "ఒక స్నేహితుడు నన్ను బలవంతంగా ఓ పాత వీడియో పార్లర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ 'థ్రిల్లర్' వీడియో చూశాను. అది నా కడుపులో గుద్దినట్టు అనిపించింది. అదొక పాట కాదు, డ్యాన్స్ కాదు... అదొక దాడి. నా కళ్లకు అప్పటివరకు అలవాటైన సాధారణ ప్రపంచాన్ని అది బద్దలుకొట్టింది. ఆ ప్రొడక్షన్, కొరియోగ్రఫీ, ముఖ్యంగా ఆ తుపానుకు కేంద్రమైన జాక్సన్‌ను చూసి ఆశ్చర్యపోయాను. అతడు మనిషిలా కదలలేదు. ఒక మానవాతీత శక్తిలా తెరపై తేలియాడాడు. అతడు దేవుడో లేక దేవుడు సృష్టించిన అద్భుతమో అనిపించింది" అని వర్మ అభివర్ణించారు. 'బిల్లీ జీన్', 'స్మూత్ క్రిమినల్', 'బ్లాక్ ఆర్ వైట్' వంటి జాక్సన్ వీడియోలు తన సినిమా దర్శకత్వానికి, ముఖ్యంగా పాటల చిత్రీకరణకు ఒక బెంచ్‌మార్క్‌గా నిలిచాయని ఆర్జీవీ తెలిపారు. తన కెరీర్‌లో ప్రతి పాట చిత్రీకరణ చర్చలో జాక్సన్ వీడియోల ప్రస్తావన వచ్చేదని గుర్తుచేసుకున్నారు. జాక్సన్ చుట్టూ అల్లుకున్న వివాదాలను తాను ఎప్పుడూ పట్టించుకోలేదని, ఎందుకంటే అతను తన కళ ద్వారా ఆత్మకు అందించిన అనుభూతి ముందు అవన్నీ చాలా చిన్నవని వర్మ అన్నారు. "అలాంటి దేవుడి లాంటి వ్యక్తి, అందరిలాగే మరణించడం ద్వారా నన్ను మోసం చేశాడు. నా కలను పగలగొట్టాడు. అందుకే అతడిని ద్వేషిస్తున్నాను. నువ్వు ఎక్కడున్నా గెలాక్సీల మధ్య మూన్‌వాక్ చేస్తూనే ఉంటావని నాకు తెలుసు. విజయవాడ వీడియో పార్లర్‌లో నువ్వు నాకిచ్చిన ఆ అనుభూతి నేను చనిపోయేవరకు నాతోనే ఉంటుంది" అంటూ వర్మ తన పోస్ట్‌ను ముగించారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449